క్లుప్తంగా

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

పలమనేరు: పట్టణంలో ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి స్పష్టం చేశారు. ఆమేరకు మున్సిపల్ సిబ్బంది శనివారం పట్టణంలోని రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లను తొలగించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పాటిస్తామని తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

ఓటరుగా నమోదుకండి



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్

పుంగనూరు: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కమిషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ ఐకేపీ మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అలాగే మండల ఐకేపీ కోఆర్డినేటర్ రవి ఆధ్వర్యంలో మహిళలు ఓటర్ల నమోదుపై ర్యాలీ నిర్వహించారు. ఓటరుగా నమోదు చేసుకోండి, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి అనే నినాదాలు చేశారు. టౌన్‌మిషన్ కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పులిచెర్లలో బైక్ ర్యాలీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పది గ్రామ పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాథమునిరెడ్డి తెలిపారు. శనివారం పులిచెర్లలో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని గెలిపించేందుకు కృషిచేయాలన్నారు. బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం



కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

కుప్పం: పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద కొన్ని ఏళ్లుగా మురుగునీటి కాలువ నిర్మాణ సమస్య పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ చర్యలు తీసుకున్నారు. నివాస గృహాల మధ్య ప్రవహిస్తున్న పేరుకుపోతున్న నీటి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక్కడ డ్రైనేజీ కాలువ నిర్మించాలని గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. స్పందించిన మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ డ్రైనేజీ కాలువ నిర్మించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారు. 20 ఏళ్లుగా ఉన్న కాలువ సమస్య పరిష్కారమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



సదుం: వసతులు పరిశీలిస్తున్న డీవైఈఓ పురుషోత్తం

సదుం: పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కేంద్రాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డీవైఈఓ పురుషోత్తం సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో వసతులను శనివారం ఆయన పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిపార్ట్‌మెంటల్ అధికారులకు సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈఓలు శ్రీరాములు, దామోదర, ఏఎల్ఎస్ఓ అజయ్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం జయకుమార్ రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గండ్రాజుపల్లిలో ఫెడరల్ బ్యాంకు శాఖ



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న అతిథులు

పలమనేరు: నియోజకవర్గంలోని గండ్రాజుపల్లిలో ఫెడరల్ బ్యాంకును శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశ్వ అప్పరెల్స్ ఎండీ మైథిలి, ఫారమ్‌గేట్ డైరెక్టర్ రిషబ్ ప్రభాకర్, రీజినల్ హెడ్ స్వాతిప్రియ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తిరుపతి క్లస్టర్‌లో 34వ బ్రాంచ్‌గా ఇక్కడ ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. బ్రాంచ్ హెడ్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

26 నుంచి ఆందోళన

చిత్తూరు అర్బన్: సప్తగిరి గ్రామీణబ్యాంకు స్వీపర్లు, మెసెంజర్లు ఈనెల 26వ తేదీ నుంచి దశలవారీగా ఆందోళనకు దిగుతున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శివరామ్ బాబు, రాజేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్యాజువల్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌ను వెంటనే ఆ శాఖకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తాము నిరసనతో పాటు సమ్మెకు కూడా వెళుతున్నట్లు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



నా రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాల పరిపాలన పరిశీలించా. కానీ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఆ మేరకు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. అందుకే రాబోవు ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నాం. పుంగనూరు నియోజకవర్గ ప్రజలంతా మా కుటుంబ సభ్యులే. వారిని కలుసుకుని వారి కష్టాలను తెలుసుకునేందుకు ఏటా రెండుసార్లు ప్రతి ఇంటికి వెళ్లడం ఆనవాయితీగా మార్చుకున్నా. సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి వివరిస్తూ ఓట్లు అడగడంలో ఉన్న సంతృప్తి మరెక్కడా లేదు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పుంగనూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

వెలుగు నింపడమే లక్ష్యం



పేదల బతుకుల్లో వెలుగు నింపడమే తన లక్ష్యమని ఇప్పటికే జగనన్న పాలనలో ఎందరో పేదలకు మేలు జరిగిందని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారికి మేలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. నేను పడిన కష్టాలు పేదలకు రాకూడదనే రాజకీయాల్లోకి వచ్చా. ఎన్నికల ముందు రెండు దఫాలు, ఎమ్మెల్యేగా రెండు దఫాలు నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లా. వారి కష్టాలను ఇప్పటికే సాధ్యమైనంతగా తీర్చా. ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాన్య ప్రజలతో మమేకంమై ఎమ్మెల్యే అంటే ఎక్కడో ఉండడు మన మధ్యే ఉంటాడని నిజాన్ని నిలబెట్టుకున్నా. ఇదేవిధంగా ముందుకెళుతూ తనపై జగనన్న ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా.

– వెంకటేగౌడ, పలమనేరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

నిత్యం అందుబాటులో ఉన్నా



గత ఐదేళ్లుగా కుప్పం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నా. కరోనా సమయంలో పార్టీ శ్రేణులు, వలంటీర్ల సహకారంతో ప్రతి కుటుంబానికి ఇబ్బంది లేకుండా నిత్యావసరాలను అందించా. కోవిడ్ బారిన పడ్డ ఎందరికో అస్పత్రుల్లో, క్యాంపుల్లో పడకలు, ఆక్సిజన్ ఏర్పాటు చేశా. విపత్కాలంలో జనంలోనే ఉంటూ వారికి భరోసా ఇచ్చా. తారురోడ్లు, సిమెంటు రోడ్లు వేయించా. ఓటర్లు ఆదరించి, నన్ను గెలిపిస్తే కుప్పం ప్రాంతానికి సెజ్ తీసుకొచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తా. పాలారు ప్రాజెక్టును, యామగానిపల్లి, మాదనపల్లిల వద్ద రెండు రిజర్వాయర్లను నిర్మిస్తాం. రైతులకు ఉపయోగపడేలా మిల్లెట్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం.

– కేఆర్‌జే భరత్, కుప్పం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

సత్వర పరిష్కారానికే లోక్‌అదాలత్





పుంగనూరు: మాట్లాడుతున్న జడ్జి వాసుదేవరావు, పక్కన న్యాయమూర్తి కార్తీక్,   కుప్పంలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్

● సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ 63 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌తో కలిసి సివిల్ 15, క్రిమినల్ 48 కేసులు పరిష్కరించారు. ఇందులో కక్షిదారులకు రూ.72 లక్షలు ఇప్పించినట్లు తెలిపారు. కేసులు సత్వరం పరిష్కరించుకునేందుకు ప్రతిఒక్కరూ లోక్ అదాలత్‌లను వేదిక చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్ నాయుడు, న్యాయవాదులు, పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 84 కేసులు పరిష్కారం

కుప్పం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో 84 కేసులు పరిష్కారమైనట్లు జూనియర్ సివిల్ జడ్జి హరీషా షేక్ తెలిపారు. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారుల ఆమోదం మేరకు పరిష్కరించినట్లు ఆమె తెలిపారు.



పలమనేరు కేసులను రాజీ చేసుకున్న కక్షిదారులతో జడ్జి శ్రీనివాసరావు

వీటిలో 73 క్రిమినల్ కేసులు సంబంధించి 94 లక్షల 64 వేలు, 11 సివిల్ కేసులకు 12.13 లక్షలు, 5 బ్యాంక్ కేసులకు 9.66 లక్షలు రాజీ ద్వారా పరిష్కారమైనట్లు ఆమె తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా దీర్ఘకాలికంగా ఉన్న కేసులకు రాజీ ద్వారా పరిష్కరించుకోవడం అందరికి శ్రేయెష్కరం అన్నారు. అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి భారతి, బార్ అసోసియేషన్ నేతలు విశ్వనాథరెడ్డి, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

పలమనేరులో 67 కేసుల పరిష్కారం

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 67 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్, క్రిమినల్, బ్యాంకులకు సంబంధించి మొత్తం రూ.3.98 కోట్ల విలువైన కేసులను రాజీ చేశారు. సీనియర్ జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కక్షిదారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరక్కుండా లోక్‌అదాలత్ ద్వారా సులభంగా కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రాజీమార్గం ద్వారా కక్షిదారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సుప్రీంకోర్టు ఈ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. కేసుల రాజీకి కృషిచేసిన న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. స్థానిక డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీపతి, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

నివాళులర్పించిన మంత్రి పెద్దిరెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే చింతల

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పినతల్లి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తల్లి కృష్ణమ్మ దశదిన కర్మలు ఎర్రాతివారిపల్లెలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రి పెద్దిరెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు కృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, కవితమ్మ, సుధీర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, రేణుకమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు. మంత్రి స్వగృహంలో పలువురు ఆయనను కలసి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, జానపద కళల అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహమ్మద్, ఎంపీపీలు భాస్కర్‌రెడ్డి, ఎల్లప్ప, నాయకులు నాగరాజారెడ్డి, తిమ్మారెడ్డి, మిద్దింటి కిశోర్, హబీబ్, రెడ్డెప్పరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, పుత్రాజు, మల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శివారెడ్డి, దాము, ఇమ్రాన్, ధనశేఖర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో భరత్ ఎన్నికల ప్రచారం

గుడుపల్లె: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బెగ్గిలిపల్లె పంచాయతీలోని అంజనాద్రీ, సదానందపురం గ్రామాల్లో ఇంటింట ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మీ ఇంటి బిడ్డగా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపించాలన్నారు. ప్రతి ఇంటా సంక్షేమ కరపత్రాలు అందించారు. అదేవిధంగా మండలంలోని సోడిగానిపల్లె, చిగర్లపల్లె, బెగ్గిలిపల్లె, నల్లగాంపల్లెలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, మండల కన్వీనర్ రామక్రిష్ణ, కోకన్వీనర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



అంజనాద్రి గ్రామంలో ఇంటింట ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

ఆక్రమిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో చర్చిస్తున్న రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, అనుమతి లేకుండా వృక్షాలను నరికినా వారిపై కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శివరాముడు హెచ్చరించారు. శనివారం సాక్షిలో 'టీడీపీ నేత గుడి చెట్లు ఆరగింత' అనే శీర్షికన కథనం వెలువడింది. కాగతి సమీపంలో గంగమ్మ గుడికి చెందిన ఓ భారీ చింత చెట్టును దిగువపల్లె టీడీపీకి చెందిన గంగులప్ప ఆక్రమించుకుని నరికేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో వేణు, సర్వేయర్ మురళీకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని ఆలయానికి చెందిన చింతచెట్టు నరకడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులతో చర్చించి చింత చెట్టునుంచి వేరుచేసిన కొమ్మలను విక్రయించగా వచ్చిన సొమ్మును ఆలయానికి చెల్లించేలా తీర్మానించారు. శ్మశాన ఆక్రమణపై రెండురోజుల్లో సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు వివరించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



చౌడేపల్లె: మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

గంగవరం: కీలపట్ల ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: పొట్టిశ్రీరాములు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనితా క్లబ్, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో హైస్కూల్ వీధిలో చలివేంద్రం ఏర్పాటుచేసి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వాసవి, వనిత క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ నాగలక్ష్మి, అధ్యక్షులు రామ్‌కుమార్, ఉషారాణి, కార్యదర్శులు శ్రీనాథ్, లోకేష్, లలితకుమారి , ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో ప్రచారం ప్రారంభం



బైక్ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె, చెంచెంరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం 1,500 బైక్‌ల ర్యాలీతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాజంపేట ఎంపీగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, పుంగనూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పార్టీ శ్రేణులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నేతలు చెంచురెడ్డి, నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, కోటా వెంకటరమణ, అలీంఖాన్, సూర్యనారాయణ రెడ్డి, సురేంద్రనాయుడు, బాబు, విజయభాస్కర్ రెడ్డి, యర్రంరెడ్డి, మదనమోహన్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, శ్రీనాథనాయుడు, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊపందుకున్న వైఎస్సార్‌సీపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: ఎన్నికల నగారా మోగడంతో వైఎస్సార్‌సీపీ ప్రచారం ఊపందుకుంది. రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము విడివిడిగా ప్రచారం ఇంటింటా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్లు కిజర్‌ఖాన్, నరసింహులు, జెపి.యాదవ్, రేష్మా, సాజిదాబేగం వారి వార్డులలో ప్రచారాలు నిర్వహించారు. అలాగే దళిత నేతలు రాజు, శంకరప్ప, పెంచుపల్లి కృష్ణప్ప ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతలు మహబూబ్‌బాషా, రాజేష్, కొండవీటి నరేష్, సురేష్, మురళి, జావీద్, అమ్ముకుట్టి, మమ్ము పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నేతలు

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

శాంతిపురం: రాళ్లబూదుగూరు పంచాయతీలో పలు నిర్మాణాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ భరత్ కొలమడుగు పంచాయతీలోని కదిరిముత్తనపల్లిలో కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. శనివారం కదిరిముత్తనపల్లిలోని కురబ కులస్తుల ఆరాధ్య దైవమైన సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద రూ 50 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. కుల పెద్దల విజ్ఞప్తి మేరకు ఎంపీ రెడ్డెప్ప నిధుల నుంచి ఈ భవనాన్ని మంజూరు చేశారు. రాళ్లబూదుగూరు పంచాయతీలోని పిల్లిగానిపల్లిలో సిమెంటు రోడ్డును, రాళ్లబూదుగూరులో రైతు భరోసా కేంద్రాన్ని, బీసీ కాలనీలో రక్షిత మంచి నీటి నీటి సరఫరా కోసం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నంగౌడు, సర్పంచులు మంజునాథగౌడు, లక్ష్మి, ఎంపీటీసీలు దేవేంద్రప్ప, రమేష్, శ్రీరాములు, నిసార్ పాల్గొన్నారు.

పశువుల సంత ప్రారంభం

గుడుపల్లె: మండలంలోని శ్రీరాళ్లగంగామాంబ ఆలయం వద్ద ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ వారపు పశువుల సంతను శనివారం ప్రారంభించారు. గుడుపల్లె మండలం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో శ్రీరాళ్లగంగమాంబ ఆలయం ఆవరణలో విశాలమైన ప్రదేశం ఉండడంతో పశువుల సంతకు అనువుగా ఉంటుందని స్థానికుల అవసరాలకోసం ప్రారంభించారు. ప్రతి శనివారం ఆలయం వద్ద పశువులు, గొర్రెలు, కోళ్లు తీసుకొచ్చి క్రయ విక్రయాలను చేసుకోవచ్చన్నారు.





కదిరిముత్తనపల్లిలో కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీభరత్, రాళ్లబూదుగూరులో ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ భరత్, నాయకులు

బ్యానర్లు తొలగించాలి

రొంపిచెర్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్లను స్వచ్ఛందంగా తొలగించాలని ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 24 గంటల్లోపు ప్రభుత్వ భవనాలపై వాల్ రైటింగ్‌లు, హోర్డింగ్‌లు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లను తొలగించాలన్నారు. రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు కనపడితే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

బైరెడ్డిపల్లె: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బైరెడ్డిపల్లె పంచాయతీ సిబ్బంది బ్యానర్లు తొలగించారు. వివిధ పార్టీల నేతలు వివిధ కార్యక్రమాలకు బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది బ్యానర్లు తొలగించారు.



బైరెడ్డిపల్లె: బ్యానర్లు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఫ్లెక్సీలు తొలగించండి



కార్మికులకు సూచనలిస్తున్న ఈఓ

చౌడేపల్లె: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలని ఈఓ సుధాకర్‌రావు పంచాయతీ కార్మికులను ఆదేశించారు. శనివారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా సచివాలయం-2 వద్ద పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్ పాల్గొన్నారు.